# "ఏమండోయ్ కృష్ణమూర్తిగారూ నమస్కారం! గుర్తున్నానా? చిన్నప్పుడు మనం మెట్రిక్ వరకూ కలిసి చదువుకున్నాం!

అనక మీరు కాలేజీ చదువులకి వెళ్ళిపోయేరు! నేను గుమాస్తాగా చేరేను! ఈ వూరికి బదిలీ అవగా మొన్ననే వచ్చి చేరేను! మీరీ వూరికి లీడింగ్ లాయరయి లక్షాధికారయ్యేరని విని ఆనందించేను!" వినయంగా అన్నాడు కుచేలరావు చేతులు కట్టుకొని!



శ్రీ మంథా వెంకట రమణారావు

"ఏమోయ్! కుచేలరావ్! బాగున్నావా? ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి! ఔనయ్యా! నిన్ననే మీ యింట మీ నాయనమ్మ వేసిచ్చిన చల్ల పొంగరాలు తిన్నట్టుంది! ఎందరు పిల్లలు? ఏం సంగతి? చదువు సంధ్యలు బాగా సాగుతున్నాయా?" ఈ జిడ్డు మనిషిని ఎంత వేగం వదుల్చుకుందామా అనుకుంటున్నాడు కృష్ణమూర్తి.

"ఏం చెప్పనండి బాబూ! నలుగురు మగా, నలుగురు ఆడా! తెచ్చిన జీతం తిండికే చాలటంలేదు! ఏదో మగపిల్లలు చేతి కందుకొస్తే కాస్త బరువు తగ్గుతుందన్న ఆశ వుంది!"

"నువ్వు చదువులలో జెమ్‌వి కదటోయ్ ఆనాడు? లెఖ్ఖల్లో నూటికి నూరూ లాగేసేవాడివి! నీ కొడుకులూ జెమ్సు అవుతార్లే!"

"ఏదోనండి! మగ పిల్లలూ, ఆడ పిల్లలూ అందరూ క్లాసుకి ఫస్టో, సెకెండో రేంక్‌లో వుంటున్నారు."

"ఇకనేమయ్యా నిశ్చింత!"


"ఏం నిశ్చింతండీ! ఆడపిల్లల పెళ్ళిళ్ళలా చేస్తానో ఏమిటో!"

"మగ పిల్లలకి కట్నంలాగి ఆడ పిల్లలకి పెళ్ళిళ్ళు చేసేవోయ్!"

"ఇంకా వాళ్ళ చదువులు పూర్తవాలి! ఉద్యోగాలు దొరకాలి! ఇవన్నీ ఎన్నో! పాములూ, నిచ్చెన ఆట! అంత వరకూ ఈ సంసార రథం సాగేదెలా?"

"సాగుతుంది లేవోయ్! నారు పోసిన వాడు నీరు పొయ్యకపోడు!" వేదాంతంలో కొన్ని పొడి మాటలు గుర్తుకొచ్చి అన్నాడు.

"అయ్యా కృష్ణమూర్తిగారూ! మనం మనం ఆనాటి మిత్రులం. ఓ ఐదు వేలు అప్పుగా ఇవ్వండి! మా పెద్దవాడి కాలేజీ చదువు గట్టెక్కిపోతుంది ఎలాగో! అనక మీ కభ్యంతరం లేకపోతే మనం వియ్యమందవచ్చు-మా అబ్బాయికి మీ అమ్మాయి నిచ్చి!"





'హమ్మ కుచేలరావూ! తక్కువ్వాడివి కావయ్యా! మంచి ఎత్తు వేసేడే! వీడి దరిద్రకొట్టు సంసారంలోకి నా కూతురు వెళ్తే బతుకుతుందీ? ఆ దరిద్రంలో మగ్గి ఏడాది తిరిగేసరికి ముక్కున కొన ఊపిరితో పీనుగులా మిగుల్తుంది! వీడి కొడుకు ఎం.ఏ. పాసయినా ఏమౌతాడు? గుమాస్తా ఔతాడు! నా కూతుర్ని గుమాస్తాగాడి కిచ్చి పెళ్ళి చేస్తానా? గుమస్తా కుచేలరావు నా వియ్యంకుడని చెప్పుకుంటానా! వీడు చిన్ననాటి స్నేహితుడవడాన్ని పలకరిస్తే జవాబిచ్చేను కాని, ఇలా బంకలా అంటుకుంటాడనుకోలేదు! వీడిని మలేరియాని వదల్చుకున్నట్టు వదల్చుకోవాలి క్వైనెన్‌తో.'

"ఎక్కడుంది కుచేలా ఐదువేలు! ఎవడుచెప్పేడయ్యా నాకు లక్షలున్నాయని! ఒంటి మీద లక్ష వెంట్రుకలుండొచ్చు! అవీ పోతున్నాయి! ఇవాళా, రేపూ డబ్బు కెంత ఇబ్బందిగా ఉందో నీకు తెలీని సంగతి కాదు! ఇంక మా అమ్మాయి పెళ్ళా? ఇప్పట్నించీ దానికి తొందరేమిటయ్యా! ఇంకా పదహారు నిండందే! నోరు విడిచి అడిగేవు కాబట్టి ఈ పాతిక పట్టుకు వెళ్ళు" అన్నాడు ముఖం ఆముదం తాగినట్ట పెట్టి-లీడింగ్ లాయర్ కృష్ణమూర్తి, నలిగిన నోట్లు పర్సులోంచి తీసి!

# కుచేలోపాఖ్యానం

మంథా వెంకట రమణారావు



"ఎందుకు లెండి బాబూ మీ కిబ్బంది! ఏదో బండి నడుస్తూంది! మీరన్నట్టు నారు పోసిన వాడు నీరు పొయ్యడా!" కుచేలరావు శెలవు పుచ్చుకున్నాడు. మరి ఆ ఛాయలకి వెళ్ళలేదు. తన తాహతెక్కడ. కృష్ణమూర్తి తాహ తెక్కడ.

కొన్ని సంవత్సరాలు గడిచి పోయేయి. కుచేలరావు అప్పో. సప్పో చేసి ఉన్న కొంపా గోడూ అమ్మి కొడుకులకి చదువులు చెప్పించేడు. మంచివాడూ, ఉదారుడూ తోటిగుమాస్తా ప్రసాదరావు అడపాతడపా ధన సహాయం చేశాడు ఇద్దరూ మంచి మిత్రులయ్యేరు. కుటుంబాలు దగ్గర కొచ్చేయి ఏవేవో ఆశలు పెట్టుకున్నారు— కొడుకులు అందుకొచ్చి తన దరిద్రం తీరుస్తారని కుచేలరావు ఆశ. కుచేలరావు తన ఒక్క కూతుర్నన్నా కోడలిగా చేసుకోడా అని ప్రసాదరావు ఆశ. ప్రసాదరావుకి ముగ్గురు కూతుళ్ళు. ఒకే ఒక్క కొడుకు!

కుచేలరావు మొదటి ఇద్దరు కొడుకులూ ఎంతో బ్రిలియంట్ ఎకడమిక్ రికార్డులతో కాలేజీలలోంచి బయటపడ్డారు.

పెద్దకొడుకు ఐ. ఏ. ఎస్. పరీక్షలో రేంకింగ్‌తో పాసయేడు.

రెండోకొడుకు బి. ఎస్సీ. అవగానే బ్యాంక్ పరీక్షకు కట్టి ఆఫీసర్‌గా ఎంపికయి కూర్చున్నాడు.

ఇంక తక్కిన ఇద్దరు కొడుకులూ. ఒకడు ఇంజనీరింగ్‌లో సీటు సంపాదిస్తే; ఆఖరివాడు మెడికల్‌లో సీటు సంపాదించాడు!

ప్రసాదరావు చూచాయగా కుచేలరావుని కదిలించాడు. "సరేలే చూద్దాం!" అన్నాడు కుచేలరావు. "మనం మనం ఒకటేనయ్యా! మనని మనం ఆదుకోకపోతే ఎవరాదుకుంటారు? స్నేహధర్మం పాటించడం నా లక్ష్యం! మాట మాటే!" ఇటువంటి కబుర్లు ఇదివరకెన్నో సార్లు కుచేలరావు ప్రసాదరావుతో అన్నాడు! వారి మధ్య రాతలలో లేని ఒప్పందం ఉండేది. ఉండేదని నమ్మేడు ప్రసాదరావు!

కాని, కొడుకులు పరీక్షలు పాసయి ఆఫీసర్లయ్యే సరికి ఇంతవరకూ కుచేలరావంటే హీనంగా, పనికిరాని గుమాస్తాగానే చూసిన పై మధ్య తరగతీ, ధనిక ప్రపంచం, కళ్ళు జిగేల్ మనగా ఒక్కసారి నిద్ర మేల్కొంది! లాటరీ ప్రైజు కొట్టినవాడ్ని చూసినట్టు చూసేరు అందరూ కుచేలరావుని. ఇంకేముంది? కుచేలరావు దశ తిరిగిందన్నారు.

మొట్టమొదట కంగ్రేచులేషన్స్ చెప్పిన వాడు చిన్ననాటి స్నేహితుడు (?) కృష్ణమూర్తే. ఈ మధ్య ఊరి మున్సిపాలిటీ ఛైర్మన్ కూడా అయ్యేడుఅతడు వార్త వినగానే మనసులో విలవిల్లాడి పోయేడు.

'మై గాడ్! ఈ కుచేలుడి కొడుకులు ఇంత వారౌతారని నేను ఆనాడు ఎందుకు ప్రిడిక్ట్ చెయ్యలేకపోయేను. ఆనాడు వీడడిగిన ఐదు వేలూ సర్ది. వీడి కొడుకుని నా కూతురుకి ప్రదానం చేసేసుకొని ఉంటే ఎంత బాగుండును. వీడి కొడుకుని నా అల్లుడిగా మార్చేసుకున్నాక, కుచేలరావ్‌కి గుడ్‌బై కొట్టేటట్టుచెయ్యడం నిముషాల మీదపనే. తన కూతురు ఆ దరిద్రంలో మగ్గిపోతుందని భయపడ్డాడు కాని. ఆ దరిద్రంలో ప్రవేశించకుండా ఎన్నో ఉపాయలుండునే! ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఆ సంగతి ఎత్తడం?!' లాయర్ వృత్తిలో ప్రవేశించేక అతడు సిగ్గు, లజ్జ, నిజాయితీ, అధర్మం అంటే భయం వదలిపెట్టేశాడు- చర్మం రినాసిరస్ చర్మంలా గట్టిపరుచుకున్నాడు. అందువల్ల ముఖానికి పెద్ద చిరునవ్వు తగుల్చుకొని కుచేలరావ్ ఇంటికి వెళ్ళేరు.

"హల్లో కుచేలరావ్‌గారూ!" ఇదివరకు "ఏమోయ్! కుచేలరావ్!" అనేవాడు....

ఇప్పుడు అతి మర్యాద ఇచ్చి బోల్తా కొట్టిద్దాం అనుకున్నాడు. "కంగ్రేచులేషన్స్! ఏమిటీ.... నా చెవినన్నా వేసేరు కారు శుభవార్త? అంతకాని వాళ్ళమై పోయేమా! మీ పెద్దవాడు ఐ.ఎ.ఎస్ పాసయ్యాడనీ, మీ రెండోవాడు బ్యాంక్ ఆఫీసరుగా సెలెక్ట్ అయ్యేడనీ విని ఎంత ఆనందించేనో ఆ దేవుడికే తెలుసు. వాళ్ళని ఈ నాడా? వాళ్ళు పుట్టిన దగ్గిర్నించి గమనిస్తున్నాను కదా! మణి పూసలనుకోండి! వాళ్ళు తప్పకుండా ఆఫీసరయి మీ పేరు నిలబెడతారని ఆనాడే నాకు తెలుసు!" అంటూ కుచేలరావు భుజం పట్టుక ఊపేసేడు.

కుచేలరావు తప్పు పట్టలేదు. ఆనాడు ఈ పెద్దమనిషే ఐదు నెలలుగులే పాతిక రూపాయలు ఇవ్వబోయేడన్న అవమానాన్ని గుర్తుకి తెచ్చుకోనూలేదు? "ఏదో మీ వంటి పెదల దలవ!" అన్నాడు అణకువగా నవ్వుతూ.

"సో! ఇంక పెళ్ళిళ్ళు కూడా చేసేండి! ఇప్పుడే అన్ని ముద్దూ ముచ్చటలూనూ! ముదిరిపోయాక ఏం ఉంటుంద సంబరం! అప్పుడు మన మాటా వినరు! ఎక్కడో వెతకడం ఎందుకు? మా పెద్దమ్మాయి ఉంది! దాని గుణగణాలు చెప్పడం తండ్రినయిన నాకు ఉచితం కాదు కాని.... మీ వాడు వజ్రం అయితే మా పిల్ల ముత్యం అనుకోండి! ఈ ఏడే బి.ఎ. పాసయింది! మరి చదువెందుకు? ఈడూ జోడూ భేష్గా సరిపోయింది!" కృష్ణమూర్తి అంలు పాయింటుకొచ్చాడు.

కుచేలరావు నసిగాడు. ఆ నసుగుడు గమనించి ఇతగాడు కట్నం గురించి నసుగుతున్నాడనుకొని.... "మనం ఇద్దరం చదువుకుంటున్న నాటి నించీ మీ తో వియ్యమందాలన్న కోరిక ఉండి పోయిందంటే నమ్మండి. ఆ కోరిక నాకుండడం వల్లనే మీ వాడు ఆఫీసర్లై కూచున్నాడు యోగమండీ. యోగం! మా పిల్లకి ఐ.ఏ.ఎస్. ఆఫీసరు భర్తగా వస్తాడని సిద్ధాంతి ఏనాడో చెప్పేడు. కట్న కానుకలలో లోపం చెయ్యటం అంటూ ఉండదు! మీరెంత అడుగుతారో అడగండి. ఏం చెల్లెమ్మా? ఏమంటారు?" అంటూ శ్రీమతి కుచేలరావ్కి ముందర కాళ్ళ బంధం వేసేడు.

"పాపం! నా స్నేహితుడు ప్రసాదరావు నా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడండీ!" కుచేలరావు ఆఖరికి సాహసించి అన్నాడు. శ్రీమతి ఉరిమి చూసింది.

**ఔను నిజం!**

నవ నాగరికతకు, ఫాషన్లకు చిహ్నంగా 18వ శతాబ్దంలో ఇంగ్లండులో స్త్రీ పురుషులు కనుబొమలపై వెంట్రుకలను తీసేసి ఎలుక చర్మాన్ని కత్తిరించుకుని అతికించుకునేవారట!

"ఆయనకి మాట ఇచ్చేరా కొంపతీసి?" (ఎవరి కొంప తీసి)

"మాటంటూ యివ్వలేదుకాని, అదే.... అండర్స్టేండింగ్! ఎప్పుడు డబ్బు అవసరంపడ్డా సర్దుబాటు చేసేవాడు!" (నోరుముయ్యండి అన్నటు భార్య చూసింది).


"వెధవ డబ్బు పోనిద్దురూ! ఇప్పుడో వందా, అప్పుడో వెయ్యీ సర్దుబాటు చెయ్యటమూ ఒక సరుబాటేనా? ఆయన డబ్బు ఆయన ముఖాన కొట్టండి! మీరు నన్ను ఆనాడు పాతిక వేలడిగినా సర్దుబాటు చేసి వుందును కుచేలరావ్గారూ! చెల్లెమ్మా, నా మాట వినండి! ఇటువంటి అవకాశం రోజూ రాదు! ప్రతి నాడి కొడుకూ ఆఫీసరయి కూచోడంలేదు! బంట్రోతు పెళ్ళి కొడుక్కయినా వాడి నాన్న పదివేలు గుంజుతున్న బంగారు రోజులివి మగ పిల్లలున్నవారికి! అంతే కాక ఆఫీసరయిన మీవాడు ఆ ప్రసాదరావు కూతుర్ని పెళ్ళాడితే అతడి హోదా ఏం కాను? గుమాస్తా ప్రసాదరావు తన మామగారని చెప్పుకోడం నామోషీకాదా? అందువల్ల నా మాట వినండి! మీకు పాతిక వేలు హార్డ్ క్యాష్ కట్నం కింద ఇవాళే ఇచ్చేస్తాను! అంతేకాదు నా సెకెండ్ హేండ్ ఫియట్ కారు మీవాడికి బహుమతిగా ఇచ్చేస్తాను! ఇంక అత్తగారి లాంఛనాలూ, ఆడబడుచుల లాంఛనాలూ చెరో వెయ్యినూటపదహారు ఇస్తాను! ఇంక మీ అమ్మాయిలకి మంచి సంబంధాలు చూసి పెట్టే పూచీ నాది. వాటంతట అవే వస్తాయండీ!" అంటూ అగరకొట్టేడు—

"మాకు సమ్మతమే అన్నయ్యగారూ" అనేసింది శ్రీమతి కుచేలరావ్!

కుచేలరావు పెద్దకొడుకు కోసం కృష్ణమూర్తి వల విసురుతే, రెండో కొడుకు కోసం ఓ అరడజను మంది పైన మధ్యతరగతి పెద్ద మనుష్యులు తమ కూతుళ్ళని కట్న కానుకలతో సమర్పించుకుందుకి వలలు విసిరేరు.


ఇలా ధనిక, మధ్య లోకంనించి పెళ్ళి కూతుళ్ళ ఆఫర్స్ వచ్చిపడగా కుచేలరావు ప్రసాదరావుని మరిచిపోయేడు. అతడు చేసిన సాయాలు మరిచి పోయేడు. "అతడి డబ్బు అతడికి పారేస్తే పోయే!" అనుకున్నాడు.

ఏనాడయితే కుచేలరావుకొడుకు ఆఫీసరయ్యేడని విన్నాడో ఆనాడే ప్రసాదరావు కుచేలరావుకొడుకు తనఅల్లుడౌతాడన్న ఆశ పొగమంచు సూర్యరశ్మిని చూసి తూ






మయినట్లు మాయమయింది. కాని ఆశ చావక, భార్య వెళ్ళి అడగమనగా ప్రసాద రావు నిట్టూర్చి ఇలా అన్నాడు.... "ఏం లాభం ? అతడికి మనం ఇంక కనిపించం. అతడి తప్పులేదు. మనం కనిపించకుండా చేస్తారు డబ్బు మూటలు పట్టుకొని. ఈ లోకంలో లేనివాడి గతి ఇంతేనే. కుచేల రావెవడో ఇన్నాళ్ళూ ఎవరికీ తెలీదు. ఈనాడు అందరూ గమనిస్తున్నారు. ఎందు వల ? ఈనాడు కుచేలరావు దగ్గర వాళ్ళకి అతి అవసరమైన, ఎంత ధర చెప్పినా కొనగలిగే వసువు ఉంది కాబటి ! వాళ్ళకి వ్యాపారం చేతనౌను. ప్రతివాడూ అమ్మడు పోగలడనీ, ప్రతి వస్తువుకీ ఒక ధర ఉంటుందనీ వాళ్ళకి తెలుసు! మరొ డబ్బున్న వాడి కొడుకుని కొనలేరేమో కాని, కుచేలరావు వంటి దిగువ మధ్య తరగతి మనిషి కొడుకు ఆఫీసరవగానె కొనేయగలరు! అందువల్ల మన వర్గంలో పోనీ మెరుగైన సంబంధం మన పిల్లలకి



కుదిరే అవకాశం కూడా లేకపోతోంది."

అయినా ఉండ పట్టలేక కదిపాడు. కదుపుతే కుచేలరావు మొదట దొంక తిరుగుడుగా మాట్లాడేడు. తరవాత ఇంక లాభం లేదని, అంతఃకరణ బాధ పెట్టగా ఉన్నమాట చెప్పేడు "నువ్వు నా దగిరి వాడివి కాబట్టి చెప్తున్నానురా ప్రసాద్! ఉన్న సంగతి ఇది! అబ్బాయిలు, ఒక హోదా ఉన్న మామ కావాలనడం అలా ఉండగా....నా కూతుళ్ళకి కట్నం డబ్బులు కాస్త వెనకెయ్యాలా వద్దా? ఒక్కో పిల్లకీ కట్నంకీ, పెళ్ళి ఖర్చులకీ పాతిక వేలకి తక్కువ పట్టుకుంటే కాదుకదా ? నా కుటుంబ పరిస్థితికూడా ఆర్థికంగా మెరుగు పడాలికదా ? ఏం చెయ్యాలో నువ్వేచెప్పు. నీ ఒక్కగా నొక్క కొడుకే రేపు ఎం. ఎ. పాసయ్యేక ఆఫీసరౌతా డనుకో ! నువ్వు మాత్రం వూరుకుంటావా ? నా కిందులో వారిగేదేమీలేదు ! పిల్లల భవిష్యత్తు బాగు పడాలని తల్లిదండ్రులకే వుంటుంది కదా!" బాధపడుతూ లెక్చర్ యిచ్చేడు. మొసలి కన్నీరు కార్చేడు !

ప్రసాదరావు బుర్రమీగ కొంగువేసు కొని యింటికి తిరిగి వచ్చేడు !

కుచేలరావు యిద్దరు కొడుకులకీ బ్రహ్మాండంగా పెళ్ళిళ్ళు జరిగేయి .వారికి మంచి హోదాలున్న మామగారు వచ్చేరు. కట్నకానుకలు దండిగా దొరికేయి.

కాని పెళ్ళిళ్ళవగానే అల్లుళ్ళని తీసు కొని మామలు వెళ్ళిపోయేరు ! ఇన్ అగర్ వర్డ్స్, అల్లుళ్ళ చేత వేరింటి కాపరాలు పెటించారు. వాళ్ళకి మరో ఊరు బదిలీ అయేటట్టు చేసేరు.. ఈ కుచేలరావు దరిద్రం నించి కలిమిని వేరు చేయింపించారు. కుచేలరావు కొడుకులు మామగారినీ, అత్తగారిని తల్లి దండ్రులుగా భావించి వారిని కొలవడం ఎక్కువ చేసి, స్వంత ఇంటికి రాకపోకలు తగ్గించేరు.

కుచేలరావుకీ కొడుకులకీ దూరం ఎక్కువయింది కాలక్రమేణా, నెలనెలా తండ్రికి వందో, రెండు వందలో పంపడంతో తమ బాధ్యత తీరింది అనుకున్నారు కొడుకులు. కొన్నేళ్ళ తరవాత అదీ మానేశారు తమ కుటుంబ బాధ్యతలూ ఖర్చులూ పెరిగేయని.

కరిమింగినవెలగపండులా కుచేలరావుకి వచ్చిన కట్నం డబ్బులు అప్పులు తీర్చ డానికే సరిపోయింది. పెళ్ళి ఖర్చులు, బంధు మిత్రులకి దారి ఖర్చులు, బట్టలూ ఇత్యాది వాటికి పదివేలు పోగా మిగిలిన డబ్బు కొడుకుల చదువులకి చేసిన అప్పులకీ, వడ్డీలకీ సరిపోయింది.

కూతుళ్ళు ఎదిగొచ్చేరు కుచేలరావుకి! ఆనాడు కూతుళ్ళకి సంబంధాలు నిమిషాల మీద కుదురుస్తానన్న వియ్యంకుడు కృష్ణమూర్తి. మరి ఆ సంగతే ఎత్తడం లేదు. ఒక వేళ కుదిర్చినా కట్నకానుకలకీ, పెళ్ళి ఖర్చులకీ డబ్బేదీ? వియ్యంకులని ఏ మొహం పెట్టుక అప్పులడగ్గలడు? పుచ్చుకున్న కట్నాలు పుచ్చేసుకొని కొడుకులని అమ్మేసేడు కదా ఆనాడు? మరింక అమ్మడానికి తన దగ్గరేం ఉంది? చెల్లెళ్ళ సంగతే తమకు పట్టనట్టు తెగతెంపులు చేసుకున్నారు ఆఫీసర్లయిన కొడుకులు ఎక్కడో వెయ్యి మైళ్ళ దూరం వెళ్ళిపోయారు. వాళ్ళ కబుర్లూ, షికార్లూ, వాళ్ళ సొసైటీ వాళ్ళది. పోనీ నలుగురు ఆడపిల్లల్లోనూ పెద్దదానికన్నా పెళ్ళి చేసే ఎలాగో ఒకలాగ కొంత బరువు తగ్గును.

ప్రసాదరావు ఒకే ఒక్క కొడుకు ఈ మధ్యే ఒక మంచి కంపెనీలో ఇంజనీర్‌గా నియమించబడ్డాడని విన్నాడు కుచేలరావు. నెలకి రెండు వేలిస్తారుట అని కలువుకుని. భార్య తన ప్రాణాలు తింటోంది.... "వెళ్ళి అడగండి! ప్రసాదరావు అమాయకుడు, మంచి వాడు! మీ మాట కాదనడు! ఆ గడ్డు రోజులలో మిమ్మల్ని ఆదుకో లేదా!" అని రోజూ పోరుతోంది.

"ఏ మొహం పెట్టుక వెళ్ళి అడగనే? అతగాడు ఆనాడు వచ్చి అడుగుతే మొహంమీద పేడ నీళ్ళు జల్లేంకదే?"

"అతని కవన్నీ జ్ఞాపకం ఉండవండీ!"

"అతనికి జ్ఞాపకం ఉండకపోవచ్చు కాని. నేనెలా మరిచిపోనే? అతడు చెప్పుచ్చుక కొట్టడుకాని. ఒక్క మాటంటే చాలు విషంతాగి చావాలి నేను!"

"అయితే అది మీ ఖర్మ! నే చెప్పింది చెప్పేను!"

తన ఖర్మ అనుకున్నాడు కుచేలరావు. ప్రసాదరావుని అడిగే నైతిక ధైర్యం లేకపోయింది. సాహసించలేకపోయేడు.

కుచేలరావు బాధలూ, డబ్బు యిబ్బందులూ, బెంగలూ పోలేదు- ఎక్కువయ్యేయి. సంఘంలో హోదా పెరగడంతో ఖర్చులు యెక్కువయ్యేయి. ఆఫీసర్ల నాన్నకదా మరి!

ఆఖరికి కుచేలరావు కుచేలరావుగానే మిగిలేడు.

మణిపూసలైన కొడుకులు తండ్రి యిల్లు వదలి మామగారింటికి చేరిపోయేరు! కలిమి కలిమిని వరించింది. లేమి లేమిని వరించింది.

ఇది కుచేలోపాఖ్యానం! దీనిని పఠించి కుచేలరావులూ, ప్రసాదరావులూ బాగుపడగలరని ఆశిద్దామా? లేక అది అడియాసే అవుతుందా?

దీపావళి శుభాకాంక్షలు!

